

9న ఐటీఐలో అప్రంటీస్ మేళా

ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9న ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'అరబిందో, శ్యాంక్రగ్ పిస్టన్స్, నాగార్జున అగ్రికెమ్, స్మార్ట్‌కమ్, వరుణ మోటార్స్ తదితర ఏడు కంపెనీల్లో అప్రంటీస్ కోసం ఈ మేళాను నిర్వహిస్తున్నాం. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో శిక్షణ పూర్తిచేసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఆ రోజు 9 గంటలకు ధ్రువపత్రాలతో ఈ మేళాకు హాజరుకావాల'ని ఆయన సూచించారు.

ఇంకా తేరుకోని 'ధర్మాన'

- ఊహించని ఓటమితో.. పార్టీ కార్యక్రమాలకు దూరం
- వైసీపీ సమావేశాలకూ గైర్హాజరు
- జగన్ భేటీలో జిల్లాకు చెందిన మరికొందరు నాయకులు డుమ్మా



శ్రీకాకుళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, మొన్నటి ఎన్నికల వరకు వైసీపీ కీలకనేతగా వ్యవహరించిన ధర్మాన ప్రసాదరావు ఇప్పటికీ తేరుకోలేకపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఓటమిని చవిచూశాక.. ప్రత్యక్ష పరోక్ష రాజకీయాలకు ఆయన గుడ్‌బై చెప్పేశారా.. అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధ, గురువారాల్లో శ్రీకాకుళం జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 4న జిల్లా పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. 5న ఎంపీపీలు, జడ్పీటీసీలతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమాలకు మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరుకాలేదు. ఆయన వర్గమూ కూడా కార్యక్రమంలో పాలుపంచుకోలేదు.

● ధర్మాన ప్రసాదరావు 1999లో జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. 2004లో వైఎస్ఆర్‌కు సన్నిహితంగా మారి.. మంత్రి పదవి చేపట్టారు. 2014లో ఓటమి చవిచూసిన ధర్మాన.. 2019లో గెలుపొందారు. రెండున్నరేళ్ల తర్వాత మంత్రి పదవి పొందారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని ఓటమి చవిచూశారు. దీంతో పార్టీ కార్యక్రమాలు ఆయన చేపట్టలేకపోతున్నారు. వారసుడు కూడా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు.

● ప్రత్యామ్నాయ పేరునూ సూచించని వైనం..

మాజీమంత్రి ధర్మాన కంటే.. ఈ సార్వత్రిక ఎన్నికలు జగన్‌కి భారీ షాక్ ఇచ్చాయి. గత ఐదేళ్ల అధికార దర్పంతో ఉన్న ఆయనను ప్రజల తమ ఓటుతో కిందకు దించారు. దీంతో పార్టీని బలోపేతం చేసేందుకు తొలిసారిగా శ్రీకాకుళం జిల్లా వైసీపీ నాయకులతో రెండు రోజుల సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి జిల్లా కేంద్రం నుంచే వైసీపీలోని ముఖ్య నాయకులు పాల్గొనకపోవడంతో జగన్‌కూ ఇబ్బందికరంగానే ఉంది. రెండేళ్లు తాను ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనేది లేదని.. పరిస్థితులు మారాక.. అప్పుడు యాక్టివ్ అవుతానని జగన్‌కు ధర్మాన కబురు పంపినట్లు విశ్వసనీయసమాచారం. అయితే పార్టీని శ్రీకాకుళం నియోజకవర్గంలో నడిపేందుకు ప్రత్యామ్నాయ వ్యక్తిని తీసుకురావాలని.. లేదా కుమారుడినైనా రాజకీయాల్లో చురుగ్గా ఉండేలా చేయాలని జగన్ చెప్పినప్పటికీ.. ఇవేవీ ధర్మాన పట్టించుకోలేదని తెలిసింది. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఎట్లా? అని జగన్‌కూ తలనొప్పి ఆరంభమైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వివాదాస్పదంగా వ్యవహరించిన ఎమ్మెల్సీ దువ్వాడ సైతం ఈ దఫా సమావేశానికి హాజరుకాలేదు. మాజీఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, సీదిరి అప్పలరాజు, గొర్లె కిరణ్‌కుమార్, కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, ధర్మాన కృష్ణదాస్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్.. కొంతమంది జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు. శ్రీకాకుళం నుంచి మాజీమున్సిపల్ ఛైర్మన్ ఎంవీ పద్మావతి మాత్రమే పాల్గొన్నారు. శ్రీకాకుళంలో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నా.. ధర్మాన మౌనం వీడకపోవడం జగన్‌కు తలనొప్పిగా పరిణమించింది.

● ప్రస్తుతం కూటమి ప్రభుత్వం... వైసీపీ హయాంలో ప్రతి తప్పిదాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పాత్రదారులను ఆధారాలతో సహా బయటపెడుతోంది. కేసుల భయమూ ధర్మానను వెంటాడుతుందని.. రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అక్రమాలు వెలుగులోకివస్తే.. జరిగే పరిణామాలను ఆలోచించి ముందుగానే ధర్మాన నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

న్యూస్ బాక్స్



'ఫస్ట్'క్లాస్ సమాధానాలు

- పార్లమెంట్ సమావేశాల్లో పౌరవిమానయాన శాఖపై ప్రశ్నోత్తరాలు
- కేంద్రమంత్రి రామ్మోహన్ సమాధానాలపై స్పీకర్ ప్రశంస

శ్రీకాకుళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌరవిమానయాన శాఖపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా గురువారం జరిగిన ప్రశ్నోత్తరాలలో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకున్నాయి. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇస్తున్న సమాధానాలకు ప్రతిపక్ష ఎంపీలతోపాటు సభాపతి ఓం బిర్లా సైతం ప్రశంసలు కురిపించారు. పార్లమెంట్ తొలి వరసలో రామ్మోహన్‌నాయుడుకి సీటు కేటాయించిన అనంతరం తన శాఖకు సంబంధించి ప్రశ్నోత్తరాలను ఎదుర్కోవడం ఇదే తొలిసారి. కటక్ ఎంపీ బత్రహరి మెహతాబ్ తొలిప్రశ్న వేశారు. పాలీ(రాజస్థాన్) ఎంపీ పీపీ చౌదరి మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో.. విమానయాన సేవల విస్తరణపై వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. ఇలా.. పలువురు ఎంపీలు ప్రశ్నించగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు బదులిస్తూ ఉడాన్ పథకంలో ఇప్పటికే పాలీ ఎయిర్ స్ట్రిప్‌ను గుర్తించామని.. విమాన సేవలపై నిరంతర పురోగతి, సమీక్ష కొనసాగుతుందని తెలిపారు. విమానయాన రంగం దేశ అభివృద్ధికి చిహ్నమని అభివర్ణించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా జోక్యం కల్పించుకుని.. సమాధానం చిన్నగా.. సూటిగా.. స్పష్టంగా చెబుతున్నారంటూ కేంద్రమంత్రిని అభినందించారు. ఎవరు ఏం ప్రశ్న వేసినా.. సమాధానం ఇచ్చేందుకు మంత్రి సిద్ధంగా ఉన్నారని స్పీకర్ అనడంతో సభలో చిరునవ్వులు పూశాయి.



రత్తకన్న రైల్వేగేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

గేటు పడితే గంట ఆగాల్సిందే!

- రత్తకన్న రైల్వే ఎల్‌సీ గేటు వద్ద నిత్యం నరకం
- ఇరువైపులా నిలిచిపోతున్న వందలాది వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న రెండు రాష్ట్రాల ప్రజలు
- సాకారం కాని ఫ్లైఓవర్ కల
- అండర్ పాసేజ్ నిర్మించాలని వినతి

ఇచ్ఛాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి)

ఆ రైల్వే గేటు పడిందో ఇక అంతే. సుమారు అరగంట నుంచి గంట వరకూ వేచి ఉండాల్సిందే. అలాగని వేరే మార్గం ఉండదు. పోనీ వెనక్కి తిరిగి వెళదామంటే పది నిమిషాల వ్యవధిలోనే వందలసంఖ్యలో వాహనాలు బారులుదీరుతాయి. ముందుకు వెళ్లలేం.. వెనక్కి వెళ్లలేం. అక్కడ గంటల తరబడి ఉండిపోవాల్సిందే. ఇదీ ఇచ్ఛాపురం మునిసిపాల్టీ పరిధిలోని రత్తకన్న రైల్వే ఎల్‌సీ గేటు వద్ద పరిస్థితి. ఒడిశా నుంచి ఏపీ ప్రారంభ గేటు కూడా ఇది. ఈ గేటు ఇచ్ఛాపురం మునిసిపాల్టీని విభజిస్తుంది కూడా. మునిసిపాల్టీలోని మెజార్టీ వార్డులు, ప్రధాన విద్యాసంస్థలు, సినిమా హాళ్లు, హాస్పిటళ్లు, ఇటుక బట్టీలు.. ఇలా ఒకటేమిటి అన్నీ గేటుకిరువైపులా విస్తరించి ఉన్నాయి. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోజుకు 50కు పైగా స్కూల్ బస్సులు, ఆపై వందలాది మంది విద్యార్థులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం పూట గేటుపడితే విద్యార్థులు పడే బాధలు వర్ణనాతీతం.

రైల్వేస్టేషన్ పక్కనే..

రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో నార్త్ కేబిన్ వద్ద కొళిగాం రోడ్డుపై ఉంటుంది ఈ గేటు. ఇచ్ఛాపురం పట్టణం నుంచి అటు కొళిగాం వైపు 15 కిలోమీటర్లు, ఇటు బొడ్డవడ వైపు 20 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరించి ఉంటుంది. వేకువజాము నుంచి వాహన తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఏపీతో పాటు ఒడిశాకు చెందిన 50 గ్రామాల ప్రజలు ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించి ఇచ్ఛాపురం పట్టణానికి చేరుకుంటారు. అయితే రైల్వే స్టేషన్ చెంతనే గేటు ఉండడంతో రోజులో నిత్యం గేటు మూసివేసి ఉంటుంది. స్టేషన్‌కు రైలు వచ్చినా.. బయలుదేరినా తప్పకుండా గేటు వేయాల్సిందే. ముఖ్యంగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు 15 కిలోమీటర్ల దూరంలోనే గొలంత్ర, సుర్లా స్టేషన్లు ఉన్నాయి. ఆ స్టేషన్ నుంచి ఇచ్ఛాపురం స్టేషన్‌కు రైలు రావడానికి పట్టే సమయం 10 నుంచి 15 నిమిషాలే. దీంతో ఇంటర్ లాకింగ్ సిస్టం కావడంతో అక్కడ రైలు బయలుదేరితే చాలూ ఇక్కడ గేటు వేస్తున్నారు. మరోవైపు ఇచ్ఛాపురం స్టేషన్ నుంచి బరంపురం వైపు రైలు బయలుదేరిన 5 నిమిషాల ముందు గేటు వేస్తుంటారు. రైలు వెళ్లిపోయిన 5 నిమిషాల తరువాత గేటు తెరుస్తుంటారు. ఈలోపల బరంపురం నుంచి సూపర్ ఫాస్టు రైళ్లు బయలుదేరితే గేటు గంటలతరబడి మూసుకో వాల్సిందే. ఆ సమయంలో అటువైపుగా వచ్చే వాహనదారులు, అత్యవసర ప్రయాణికులు పడే బాధలు వర్ణనాతీతం.

ఫ్లైఓవర్‌కు ప్రతిపాదన..

ఈ గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలన్నది ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. గతంలో మున్సిపాల్టీలో ప్రత్యేక ప్రతిపాదనలు చేశారు. మునిసిపల్ అజెండాలో పెట్టారు కూడా. అయితే ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలంటే స్థలం ఇరుకుగా ఉంది. ఆపై భారీగా నిధులు అవసరం. అందుకే ఈ విషయంలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో అండర్ పాసేజీలు నిర్మించారు. పలాస సమీపంలోని లక్ష్మీపురం,హూండి, నౌపడ, కోటబొమ్మాళి, ఉర్లాం, ఆమదాలవలస, జి.సిగడాం వంటి చోట్ల అండర్ పాసేజీలు నిర్మించారు. చాలా తక్కువ ఖర్చుతో స్వల్పకాలంలోనే ఈ పాసేజీలు ఏర్పాటుచేశారు. అయితే ఈ రహదారి ప్రధానంగా ఒడిశాకు ఎక్కువగా ఉపయోగం. ఆ రాష్ట్రానికి చెందిన అశ్విని వైష్ణవ్ రైల్వే శాఖ మంత్రిగా ఉన్నారు. జిల్లా ఎంపీ రామ్మోహన్‌నాయుడు కేంద్రమంత్రిగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరూ దృష్టి సారిస్తే ఇక్కడ అండర్ పాసేజీ నిర్మాణం తప్పకుండా పూర్తయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా దృష్టిపెట్టాలని ఈ ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రైల్వే గేటు వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులు

గంటల తరబడి యాతన..

ఇక్కడ గేటు పడింది అంటే గంటల తరబడి ఉండిపోవాల్సిందే. పాఠశాలకు వెళ్లలేకపోతున్నాం. ఒక్కోసారి తరగతులు కూడా మిస్ అవుతున్నాం. సహనానికి పరీక్ష పెడుతున్నట్టు ఇక్కడ గేటు పడుతుంది. ఆ సమయంలో చాలా బాధ అనిపిస్తోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి.

-దక్కత అరుణ, విద్యార్థిని, ఇచ్ఛాపురం

నరకం చూస్తుంటాం..

ఈ గేటు వద్ద నిత్యం నరకయాతన పడుతుంటాం. ఇచ్ఛాపురం పట్టణానికి రావాలంటే ఈ రోడ్డే శరణ్యం. దాదాపు 50 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కనీసం అండర్ పాసేజ్ నిర్మాణం చేపట్టాలి. జిల్లాలో అవసరం లేనిచోట వీటిని ఏర్పాటు చేశారు. ఇటువంటి చోట ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది.

- సుగ్గు ప్రేమ్‌కుమార్, ఎం.తోటూరు

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

గుజరాతీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, కొనుగోలుకు సంబంధించి రైతులకు సకాలంలో నగదు చెల్లించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై గురువారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, జేసీలు, పౌరసరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు, దళారుల ప్రమేయం ఉందని తెలిసినా.. రైతులకు అన్యాయం జరిగినా చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. గన్నీ బ్యాగ్స్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్లు, జేసీలు ఆకస్మిక పర్యటనలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తదితర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గుజరాతీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అన్ని రకాల రెవెన్యూ, వ్యక్తిగత భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 6 నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని.. విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల ప్రణాళిక, కార్యాచరణపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రణాళిక ప్రకారం నిర్ణయించిన తేదీల్లో, నిర్దేశించిన మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సదస్సులను నిర్వహిస్తాం. సదసులో అధికారులు పాల్గొని.. భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతారు' అని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వరరావు, బీజేపీ ప్రతినిధి రావాడ పురుషోత్తం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, డీఎస్పీ ప్రసాద్, జాయింట్ సబ్ రిజిష్టర్ ఏవీ సురేష్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బీఆర్ బివి ప్రసాద్ పట్నాయక్, అటవీ శాఖాధికారి ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.



మృతులు : మనీషా, సాయి (ఫైల్)



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అయ్యో.. దేవుడా..

- వివాహ వేడుకకు వెళ్తూ.. రోడ్డు ప్రమాదం
- మేనమామ, మేనకోడలు దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- కళ్ల ముందే కుమార్తె, తమ్ముడు మృతి చెందడంతో బోరున కన్నీటిపర్యంతమైన మహిళ

మెళియాపుట్టి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆ నలుగురూ ద్విచక్ర వాహనంపై వివాహ వేడుకకు వెళ్తున్నారు. ఇంతలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ట్రాక్టర్‌ను ఢీకొన్ని ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కళ్ల ముందే ఓవైపు కన్న కూతురు.. మరోవైపు తమ్ముడు మృతి చెందడంతో ఆ తల్లి ఆర్తనాదాలు మిన్నంటాయి. అయ్యో.. దేవుడా ఎందుకిలా చేశావ్ అంటూ ఆమె రోదన.. స్థానికులకు కన్నీరు తెప్పించింది. వివరాల్లోకి వెళితే.. మెళియాపుట్టి మండలం చిన్నహంస గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దట్టి సాయి(23), మనీషా(13) మృతిచెందారు. వీరిద్దరూ మేనమామ, మేనకోడలు. మెళియాపుట్టి మండలం ముడికిండిభద్రకు చెందిన ఎం.చామంతికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మనీషా ఎనిమిదో తరగతి, శిరీష ఆరో తరగతి చదువుతున్నారు. కాగా.. శుక్రవారం మందసలోని చామంతి బంధువుల ఇంట వివాహ వేడుక ఉంది. ఈ వేడుకకు వెళ్లేందుకుగాను.. మందసలో నివాసం ఉంటున్న తన తమ్ముడు దట్టి సాయికి ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకురావాలని చామంతి చెప్పింది. ఈ మేరకు గురువారం సాయి ద్విచక్ర వాహనం తీసుకువచ్చి.. చామంతితోపాటు ఇద్దరు కుమార్తెలు కూడా వాహనంపై తీసుకెళ్లాడు. కాగా.. వారు బయలుదేరి పది నిమిషాలు కాకముందే చిన్నహంస సమీపంలో టెక్కలిపట్నం నుంచి రంపకాన వెళ్తున్న ట్రాక్టర్‌ను క్రాస్ చేస్తుండగా ఢీకొన్నారు. దీంతో కింద పడి సాయి, ఆయన పెద్ద మేనకోడలు మనీషా అక్కడికక్కడే మృతి చెందారు. చామంతితోపాటు ఆమె చిన్న కుమార్తె శిరీష తీవ్రంగా గాయపడ్డారు. కళ్లముందే తమ్ముడు, కుమార్తె మృతి చెందడంతో చామంతి కన్నీరుమున్నీరుగా విలపించింది. అయ్యో.. దేవుడా ఎందుకిలా చేశావయ్యా.. అని రోదించింది. అమ్మా.. పెళ్లికి వెళ్దాం కళ్లు తెరు అమ్మా.. అంటూ కుమార్తెను పట్టుకుని కన్నీటిపర్యంతమైంది. తీవ్రగాయాలతో బాధపడుతూ.. లేవలేని స్థితిలో ఉన్న ఆమె రోదన చూపరులను కంట తడి పెంచింది. స్థానికులు క్షతగాత్రులిద్దరినీ పలాసలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. అలాగే సాయి, మనీషా మృతదేహాలను పలాస ఆస్పత్రికి తరలించి శవపంచనామా నిర్వహించారు. పాతపట్నం సీఐ రామారావు, ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజలకు రక్షణగా..

- పోలీసు శాఖకు అనుసంధానంగా హోంగార్డ్‌ల సేవలు
- ట్రాఫిక్ నియంత్రణలో కీలకపాత్ర
- నేడు హోంగార్డుల దినోత్సవం

సిక్కోలులో 'రంగస్థలం'

- రేపటి నుంచి రజతోత్సవ వేడుకలు
- బాపూజీ కళామందిర్‌లో ఏర్పాట్లు

6లో

మత సామరస్యానికి ప్రతీక.. పీర్లకొండ యాత్ర

6లో



పీర్లకొండపై దర్గా వద్ద భక్తులు..

ప్రజలకు రక్షణగా..



- పోలీసు శాఖకు అనుసంధానంగా హోంగార్డుల సేవలు
- ట్రాఫిక్ నియంత్రణలో కీలకపాత్ర
- నేడు హోంగార్డుల దినోత్సవం

శ్రీకాకుళం క్రైం/ ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖాకీ దుస్తులు వేసుకుని ఇరవై నాలుగు గంటలూ శాంతిభద్రతలను కాపాడేందుకు శ్రమిస్తూ పోలీసు శాఖకు చేదోడువాదోడుగా హోంగార్డులు పనిచేస్తున్నారు. ప్రజలకు రక్షణ కల్పించడంతోపాటు ట్రాఫిక్ నియంత్రించడంలో వీరికి మంచి గుర్తింపు ఉంది. వృత్తే దైవంగా భావించే ఇటువంటి వారికి పోలీసు శాఖ అండగా ఉంటూ ఆరోగ్య భద్రతతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. శుక్రవారం హోంగార్డుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

హోంగార్డ్స్ వ్యవస్థ.. 1962 డిసెంబరు 6న స్వచ్ఛంద సంస్థగా ఏర్పాటై.. ప్రస్తుతం పోలీసుల శాఖకు అనుబంధంగా పనిచేస్తోంది. ట్రాఫిక్‌ను నియంత్రించడం.. నిందితులను వెతకడం.. వారెంట్, ఎన్‌బీడబ్ల్యూ నోటీసులు అందించడం.. వీఐపీలు, వీవీఐపీల బందోబస్తుకు.. ఎస్కార్ట్స్‌గా.. డ్రైవర్లు, గన్‌మ్యాన్లుగా ఇలా పలు రకాల విధులను పోలీసులతో సమానంగా హోంగార్డులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 757 మంది హోంగార్డులు పని చేస్తున్నారు. వీరిలో 127 మంది వివిధ విభాగాల్లో డిప్యుటేషన్ విధానంలో వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తు న్నారు. అగ్నిమాపక, ఆర్టీవో, విజిలెన్స్, ఏసీబీ, ఆర్టీసీ, అరసవల్లి దేవస్థానం, స్టీల్‌ప్లాంట్, జాతీయ రహదారుల విభాగం, మహిళా శిశు సంక్షేమశాఖల్లో డిప్యూటేషన్‌పై కొంతమంది పనిచేస్తున్నారు. ఇందులో 108 మహిళా హోంగార్డ్‌లు ఉన్నారు. వీఐపీ వాహనాలకు డ్రైవర్లగా, బాంబు డిస్పోజల్ టీమ్‌లో కొంతమంది విధులు నిర్వర్తిస్తున్నారు. హోంగార్డులకు ప్రస్తుతం రోజుకి రూ.710 జీతం సీఎఫ్ఎంఎస్ విధానంలో చెల్లిస్తున్నారు. ఈ ఏడాది 6 మంది హోంగార్డులు మృతి చెందగా.. ఇద్దరు హోంగార్డులకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.10 లక్షలు సాయం అందజేశారు. జిల్లాలో హోంగార్డు ఎవరైన ఉద్యోగ విరమణ చెందితే మిగిలిన హోంగార్డులు తమ ఒక్క రోజు జీతాన్ని విరాళంగా ఇస్తున్నారు. ఇలా ఈ ఏడాది ఐదుగురు ఉద్యోగ విరమణ పొందగా.. వీరిలో నలుగురికి రూ.16,79860 లక్షలకుపైగా అందజేశారు. అదే విధంగా మృతి చెందిన ఇద్దరు హోంగార్డులకు సంబంధించి వారి కుటుంబ సభ్యుల ద్వారా కారుణ్య నియామకాలు చేపట్టారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం ఆరుగురికి రూ.60 వేలు ఇచ్చారు.

నెల రోజులకు సరిపడా పని దినాలు

గతంలో నిధులు లేని కారణంతో అందరిని విధులకు ఉపయోగించే వారు కాదు. ప్రస్తుతం హోంగార్డులందరికి నెల రోజులకు సరిపడా పని దినాలు కల్పిస్తున్నారు. వీరందరికి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సౌజన్యంతో ఆరోగ్య కార్డులు, ఇళ్ల స్థలాలు త్వరలో సమకూర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ది శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ హోంగార్డు కోపరేటివ్ క్రెడిట్ సొసైటీని ఏర్పాటు చేయనున్నారు. అలాగే కానిస్టేబుల్స్ నియామకాల్లో ప్రస్తుతం తమకు ఉన్న 12 శాతాన్ని 20 శాతానికి పెంచాలని హోంగార్డులు డిమాండ్ చేస్తున్నారు. కానిస్టేబుల్ ఎంపికలో కోటా పెంచితే చాలా మందికి ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం హోంగార్డు దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి



జిల్లాలో హోంగార్డుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నాం. హోంగార్డులకు ఆరోగ్య రక్ష ద్వారా భద్రత కల్పిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు కూడా పోలీసులతో సమానంగా ఇకపై వైద్య సేవలందించేందుకు శ్రీకారం చుట్టాం. ప్రస్తుతం హోంగార్డు మరణిస్తే మిగిలిన హోంగార్డులు తమ ఒక్క రోజు వేతనాన్ని ఆ కుటుంబానికి అందిస్తున్నారు. దీనితో పాటు బ్యాంకులతో మాట్లాడి హోంగార్డులకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా ప్రయత్నిస్తున్నాం. ప్రమాదవశాత్తు హోంగార్డు చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉపాధి కల్పిస్తున్నాం. ప్రమాద బీమా కూడా వర్తింపజేస్తాం. ప్రజల కోసం శ్రమించే హోంగార్డులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

సిక్కోలులో 'రంగస్థలం'

- రేపటి నుంచి రజతోత్సవ వేడుకలు
- బాపూజీ కళామందిర్‌లో ఏర్పాట్లు



బాపూజీ కళామందిర్

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య సంస్థ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 7 నుంచి మూడు రోజుల పాటు రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. 1999 నవంబరులో ప్రారంభమైన ఈ సమాఖ్య సంస్థ.. సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో విభిన్న, వినూత్న పద్ధతిలో ప్రతి నెలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నగర కళాకారులకు, సాహితీ ప్రియులకు వీనులవిందు చేస్తోంది. ప్రతి నెలా మొదటి శనివారం క్రమం తప్పకుండా వివిధ కళా ప్రదర్శనలు నిర్వహిస్తోంది. ప్రతినెలా సుమారు 30 మందికి పేద, వృద్ధ కళాకారులకు రూ.400 చొప్పున పింఛన్ అందజేస్తోంది. ఇలా ఇప్పటికి 302 నెలలుగా నిర్విరామంగా కొనసాగింది. మేలో రాష్ట్రస్థాయి అత్యుత్తమ పౌరాణిక కళాకారులచే పౌరాణిక నాటిక ప్రదర్శనలు భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. గత 12 ఏళ్ల నుంచి రాష్ట్ర స్థాయి నాటిక కళా పరిషత్‌ను కూడా ఏర్పాటు చేస్తూ, రాష్ట్రంలోనే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులను తెప్పించి నాటికలు ప్రదర్శింపజేస్తున్నారు. రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ నిర్వహణలో నంది నాటకోత్సవాలను కూడా ప్రదర్శిస్తున్నారు. సాంఘిక నాటికలు, నాటకలు, పౌరాణిక నాటికలు, జానపద శాస్త్రీయ నృత్యాలు కూడా ప్రదర్శిస్తున్నారు. బాపూజీ కళామందిర్‌లో మినీ నంది నాటకోత్సవాలు కూడా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రంగస్థలం కళాకారులు సమాఖ్య తరఫున నాటిక, పౌరాణిక నాటక పోటీలు, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నారు.

మూడురోజుల పాటు..

బాపూజీ కళామందిర్‌లో శనివారం నుంచి మూడు రోజుల పాటు రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 7న సాయంత్రం జానపద కళారూపాలు ఊరేగింపులో భాగంగా గిరిజన నృత్యాలు, పగటి వేషాలు, జముకుల పాట, జానపద కళారూపాల స్టేజ్ ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అదేరోజు రాత్రి 8 గంటలకు 'మా ఇంట్లో మహాభారతం' చిలకలూరిపేటకు చెందిన నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వంలో, మద్దుకూరి రవీంద్రబాబు రచనలో ప్రదర్శన ఉంటుందన్నారు.

- 8న ప్రముఖ కూచిపూడి నృత్య దర్శకురాలు స్వాతి సోమనాథంచే ద్రౌపతి నృత్య రూపకం, గజల్ శ్రీనివాస్‌చే గజల్ గానం, అదే రోజు రాత్రి గుంటూరు వారిచే ఎస్.రవీంద్ర రెడ్డి దర్శకత్వంలో 'ఇది అతని సంతకం' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు.
- 9న సాయంత్ర లోకనాథం నందికేశ్వరరావుచే మిమిక్రీ, అదే రోజు రాత్రి రాజా బాలభారతి నాటక కళా సమితి ఆధ్వర్యం లో రాష్ట్రస్థాయి కళాకారుల చే సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉద్దానంలో వింత జంతువు సంచారం

- భయాందోళన చెందుతున్న ప్రజలు



అడవి జంతువు అడుగులు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో వింత జంతువు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొద్ది రోజులుగా జిల్లాలో పెద్దపులి సంచరిస్తుందన్న అలజడి నెలకొంది. ఈ నేపథ్యంలో ఏ జంతువు అడుగులు పెద్దవిగా కనిపించినా పులి ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీంతో తీరప్రాంతంలో ప్రజలు బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. ఒంటరిగా బయటకు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. తాజాగా గురువారం వజ్రపుకొత్తూరు మండలంలోని చినవంక- బాతుపురం గ్రామాల మధ్య మర్రిచెట్టు వద్ద వింతజంతువు అడుగులు కనిపించడంతో పులి సంచరిస్తుందన్న భయాందోళన స్థానికుల్లో నెలకొంది. ఈ విషయం తెలుసుకొన్న అటవీశాఖ అధికారులు జంతువు అడుగులు పరిశీలించారు. ఇవి హైనా(గొద్దవా) అడుగులని అటవీశాఖ అధికారి పోలయ్య పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పులి సంచరించడంలేదని, ఎవరూ ఆందోళన చెద్దవద్దని తెలిపారు. ఐనాలు ఆవు దూడలపై దాడి చేస్తాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా ఐనాలు ఈ ప్రాంతంలో ఇటీవల కనిపిస్తున్నట్లు బాతుపురం సర్పంచ్ లక్ష్మీనారాయణ చెప్పారు.

గొర్రెల మందపై అడవి జంతువు దాడి

- 15కుపైగా జీవాలు మృతి



చిననీలావతి తోటల్లో మృతిచెందిన గొర్రె పిల్లలు

పలాస రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాస మండలంలోని చిననీలావతి కొబ్బరి తోట ల్లో గురువారం మధ్యాహ్నం గొర్రెల మందపై అడవి జంతువు దాడి చేయడంతో 15 గొర్రెలు మృత్యువాత పడగా, మరో ఏడు గాయపడ్డాయి. మాకన్నపల్లికి చెందిన గొర్రెల కాపర్లు దాసరి ఆదినారాయణ, మద్దిల లచ్చయ్య, సాలిన కామయ్యలు వారి గొర్రెలను చిననీలావతి లోని ఓ కొబ్బరితోటలో మంద వేశారు. మధ్యాహ్నం మంద వేసిన గొర్రెల కాపర్లు భోజ నానికి బయటకు వెళ్లారు. ఆ సమయంలో అడవి జంతువు గొర్రెలపై దాడిచేసింది. కాగా పగటి పూట అడవి జంతువు లు వచ్చే అవకాశం లేదని, కుక్కలే దాడిచేసి ఉంటాయని కొందరు గొర్రెలకాపర్లు, రైతు లు భావిస్తున్నారు. అధికారు లు స్పందించి తమకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

మత సామరస్యానికి ప్రతీక.. పీర్లకొండ యాత్ర

- ఏటా మార్గశిరమాసంలో ప్రతి గురువారం నాడు నిర్వహణ
- కొండపై పురాతన కట్టడాలు
- హిందువులు పూజలు.. ముస్లింలు నివేదనలు



పీర్లకొండకు పోటెత్తిన భక్తజనం

ఇచ్ఛాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో పరమత సహనంతో జరిగే పండుగలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవిస్తారు. స మష్టిగా పండుగలు జరుపుకుంటారు. అందు కు ప్రతీక పీర్లకిండ యాత్ర. ఇక్కడ హిందు వులు విశ్వసించేలా కొలువు తీరి ఉన్నట్లు ఏ దేవుడూ దేవతా ఉండరు. కాని ఏటా ఎంతో సందడిగా ఉత్సవాలు జరుగుతాయి. మార్గశిర మాసంలో వచ్చే గురువారాల్లో కొండపై పూజలు చేస్తుంటారు. కులమతాలకు అతీతం గా పూర్తిగా మత సామరస్యంతో సాగే పం డగ ఇంది. హిందూ మత పద్ధతుల్లో పూజా సామగ్రిని తీసుకువెళ్తే అక్కడ ముస్లింలు వాటిని భగవంతునికి నివేదిస్తారు.

పోటెత్తిన భక్తులు

పీర్లకొండ యాత్రకు గురువారం భక్తుల పోటెత్తారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన పీర్లకొండ యాత్రకు గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా వచ్చి పీర్లస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అటుకులు, బెల్లాన్ని నైవేద్యంగా సమ ర్పించారు. అనంతరం కొండపై గల రెండు మందిరాల్లో పూజలు చేశారు. కొండపైగల కందకంలోని నీటిని భక్తులంతా పవిత్ర తీర్థంగా స్వీకరించారు. కొండ చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను భక్తులకు కనువిందు చేశాయి. తేలుకుంచి గ్రామంలో గల చెట్లపై ఉన్న విదేశీ పక్షులు, కైలాసగిరి కొండ, చిలక సముద్రం చూసి ఆహ్లాదంగా గడిపారు. రైల్వేస్టేషన్ మీదుగా భక్తులు కొండకి రాకపో కలు సాగించడంలో ఆ ప్రాంతమంతా కిటకిట లాడింది. కొండపై ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ మీసాల చిన్నమనాయుడు పర్యవేక్షణలో పట్టణ, రూరల్ ఎస్ఐలు చిన్నమనాయుడు, శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రాజెక్ట్ ప్రదర్శనలో విద్యార్థులు

టెక్ ఫెస్ట్‌లతో సృజనాత్మకత

- ఆర్జేడీ సత్యనారాయణమూర్తి
- ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్-2024 ప్రారంభం


ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థు ల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే టెక్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నట్టు సాంకేతిక విద్య శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) జె.సత్యనారాయణ మూర్తి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాలిటెక్ ఫెస్ట్-2024ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి ఫెస్ట్‌ల నిర్వహణతో నూ తన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నా రు. ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకునేలా విద్యా ర్థులు ముందుకు సాగాలన్నారు. సాంకేతిక వి ద్యాశాఖ ఉప సంచాలకులు (అకడ మిక్) కె.విజయభాస్కర్ మాట్లాడు తూ.. ఇలాంటి ఫెస్ట్‌ల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారిలో నిబిడీకృత మై ఉన్న నైపుణ్యాలు బయటప డతాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకిరామయ్య మాట్లా డుతూ.. సాంకేతిక నైపుణ్యం, భావ వ్యక్తీకరణతోనే అద్భుతమైన అవకా శాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ ఫెస్ట్‌లో ప్ర థమ స్థానాన్ని కైవసం చేసుకున్నవారికి రూ.25 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.10 వేలు బహుమతి ఉంటుందన్నారు. ఈ ఫెస్ట్‌లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన 15 ప్రాజెక్ట్‌లు త్వరలో రాష్ట్ర స్థాయి నిర్వహించే పోటీల్లో ప్రద ర్శనకు పంపిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథ మ స్థానం నిలిచినవారికి ఒక లక్ష రూపాయలు, ద్వితీయ స్థానానికి రూ.50 వేలు, ప్రతి బ్రాంచ్ నుంచి కన్సోలేషన్ బహుమతి రూ.25 వేల వం తున అందజేస్తారన్నారు. ఈ ఫెస్ట్‌లో జిల్లాలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 69 ప్రాజెక్ట్‌లను విద్యార్థు లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.గో విందనాయుడు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఆర్జేడీ సత్యనారాయణమూర్తి

అప్పుడు యాప్‌లు.. ఇప్పుడు లింకులు

- ఉక్కిరిబిక్కిరవుతున్న ఉపాధ్యాయులు



వెబ్ఎక్స్ సమావేశంలో పాల్గొన్న హెచ్ఎం, ఎంఈవోలు

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నిర్ణయా లతో ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు విసుగుచెందిన విషయం విదితమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల నుంచి విముక్తి లభించినా లింక్‌లతో బోధనకు ఆటంకం కలుగుతోంది. తాజాగా పాఠశా ల విడిచిపెట్టిన తర్వాత ఒక వైపు వెబ్ఎక్స్ సమావేశాలు, మెగా పేరెంట్ డే ని ర్వహణ కోసం వారం రో జు లం గా లింక్ మీద లింక్‌లతో ఆన్‌లై న్‌లో విద్యాశాఖ వివిధ సమా చారం అప్‌లోడ్ చేయాలని ఆ దేశాలు జారీచేయడంతో ఉపా ధ్యాయులు బోధనకు దూరంగా ఉంటున్నారు. సింగిల్ ఉపాధ్యా యుల ఉండే పాఠశాలల్లో బోధ న, లింక్‌లు, వెబ్ఎక్స్ సమావే శాలు అంతా ఒక్కరిపైనే భారం పడడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇన్నాళ్లు అపార్ నమోదు విషయంలో అవస్థలు పడ్డారు. తాజాగా ఈ నెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్‌డే వేడుకలకు సంబంధించి.. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెబ్ఎక్స్ స మావేశాలతో అసహనం చెందుతున్నారు. మరోవైపు పాఠశాల యా జమాన్య కమిటీ చైర్మన్ ఫోన్‌నెంబరు ద్వారా మెగా పేరెంట్ డే ని ర్వహణకు ఆన్‌లైన్‌లో వివరాలు నిక్షిప్తం చేయడం, ప్రోగ్రెసివ్ కార్డు లను నింపడం, పేరెంట్స్‌కు, పాఠశాల పరిధిలో ఉం డే ప్రముఖులను ఆహ్వానించడం, భోజన సదుపాయాలు కల్పించ డం తదితర పనులతో ఆందోళన నెలకొంది. ఏకోపాధ్యాయ పాఠశా లల్లో అన్ని బాధ్యతలు ఒక్కరే నిర్వహించడంతో తాము మరింత ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉ పాధ్యాయులపై ఒకే సారి భారం మోపడం తగదని యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు బి. శ్రీరామమూర్తి, బి. కేశవరా వు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రణస్థలం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రణస్థలం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11కేవీ కమ్మసిగడాం ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకూ కమ్మసిగడాం, వేల్పురాయి, దేవరాపల్లి, అర్జునవలస తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, మర్మతుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ పి.యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఎచ్చెర్ల మండల హెడ్ క్వార్టర్ ఫీడర్, ఎచ్చెర్ల, అనమిత్ర టౌన్‌షిప్, ఎస్ఎం పురం పరిధిలో సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కిడ్నీ వ్యాధితో ఒకరి మృతి



రాంబుజ్జి(ఫైల్)

ఆమదాలవలస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన ముద్దాడ రాంబుజ్జి(46) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎం పురం గ్రామానికి చెందిన రాంబుజ్జి ఎమ్మెల్యే కూన రవికుమార్‌కి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు. కొంతకాలం నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రామ్‌బుజ్జి గురువారం మృతి చెందారు. ఈ మేరకు ఆమదాలవలసలో రామ్‌బుజ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

రాంబుజ్జీ మృతికి సంతాపం

ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్ఎం పురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ముద్దాడ రాంబుజ్జీ గురువారం మృతిచెందడంతో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, రాష్ట్ర ఎన్‌జీవో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు తదితరులు సంతాపం వ్యక్తంచేశారు.

సిక్కోలును అభివృద్ధి పథంలో నడిపిస్తా

శ్రీకాకుళం అర్బన్/అరసవల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన సిక్కోలు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. గురువారం 80 అడుగుల రోడ్డులో గల జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ ఆధ్వర్యంలో బహిరంగ సభ, ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. శ్రీకాకుళం, పాలకొండ, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, నిమ్మక జయకృష్ణ, మామిడి గోవిందరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అన్నెపు రామకృష్ణ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేలను పరిరక్షించుకుంటేనే భవిత

ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేలను పరిరక్షించుకుంటేనే ముందు తరాలకు భవిత ఉంటుందని డీపీఎం టి.రేవతి తెలిపారు. ఎస్ఎస్ఆర్‌పురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో గురువారం ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ ఉపాధ్యాయ కోఆర్డినేటర్ దార్లపూడి రవి, కృషి విజ్ఞాన కేంద్రంకు చెందిన కిరణ్‌కుమార్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోషి, డాక్టర్ కె.రాజ్‌రుషి, డాక్టర్ డీకేడీ దీక్షిత్, ఎస్ఎస్ఆర్‌పురం ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులు సక్రమంగా నిర్వహించాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మీభూమి-మీహక్కు రెవెన్యూ సదస్సులు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ వెంకటరావు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శ్రీహరి, సీఎస్ డీటీ సంతోష్ పాల్గొన్నారు.

● రణస్థలం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కారానికి శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని తహసీల్దార్ ఎస్.ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

● గార, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గార మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.రమణారావు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేల ఆవశ్యకత తెలుసుకోవాలి

సోంపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొత్రఖండ పాఠశాలలో ప్రపంచ నేల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నేల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏవో టీ.నరసింహమూర్తి, ప్రధానోపాధ్యాయులు అప్పలస్వామి, ఉపాధ్యాయు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులతో ఇక్కట్లు తప్పేదెలా?

● శ్రీకాకుళం పట్టణ రోడ్లపై విచ్చలవిడిగా సంచారం

● ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

● చోద్యం చూస్తున్న కార్పొరేషన్ అధికారులు



నగరంలోని ప్రధాన రహదారిపై వెళ్తున్న పశువులు

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటో చూస్తుంటే నగరంలో పశువుల జాతర జరుగుతుందేమో అనిపిస్తుంది కదూ.. అలా అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే. ఎందుకంటే శ్రీకాకుళం నగరంలో ఇలాంటి దృశ్యాలు నిత్యకృత్యంగా మారాయి. నగరంలోని పశువుల పెంపకందారులు వాటి పాలతో వ్యాపారం చేస్తుకుంటున్నారే తప్ప.. పోషణపై శ్రద్ధ చూపడం లేదు. ప్రతి రోజు ఉదయం పాలు తీసిన తర్వాత మేత కోసం వదిలేస్తున్నారు. దీంతో విచ్చలవిడిగా నగర రోడ్లపై తిరుగుతూ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. కళింగ రోడ్డు, పాలకొండ రోడ్డు, మిల్లు జంక్షన్, 80 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల్లో పశువులను రోడ్లపై విడిచిపెడుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. వీటిని నియంత్రించాల్సిన కార్పొరేషన్ అధికారులు తూతూ మంత్రంగా హెచ్చరించి వదిలేస్తుండడంతో ఈ సమస్య పరిష్కారం కావడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే నగరంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. దీనికితోడు పశువులు విచ్చలవిడిగా రోడ్లపైకి వస్తుండడంతో మరింత క్లిష్టంగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వీఆర్‌వోపై దాడి ఘటనపై ఎంపీడీవో విచారణ



దాడిఘటనపై సచివాలయ సిబ్బందిని విచారిస్తున్న ఎంపీడీవో

పొందూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తోలాపి సచివాలయంలో వీఆర్‌వో ఎం.దివాకర్ (రేవతిరావు) పై జరిగిన దాడి ఘటనపై మండల పరిషత్ అధికారి ఎం.మన్మథరావు గురువారం విచారణ చేపట్టారు. సచివాలయంలో మంగళవారం గ్రామానికి చెందిన పప్పల రామినాయుడు కంప్యూటర్‌ను ధ్వంసం చేయడమే కాకుడా వీఆర్‌వోపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కలెక్టర్ ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో సిబ్బందిపై దాడిచేసి, సామగ్రి పగులకొడితే ఎందుకు ఫిర్యాదుచేయలేదని ప్రశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదుచేసిన ఎంపీడీవో గురువారం సచివాలయ సిబ్బంది, గ్రామస్థులతో వేరువేరుగా విచారణ చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గురువారం నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని,వారాంతపు సెలవులు,జాతీయ సెలవులు అమలు చేయాలని కోరారు. తొలుత కమిషనర్ వీవీ ప్రసాదరావుకు యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, యూనియన్ నాయకులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్‌కుమార్, నాయకులు కిషోర్, రామారావు, రాజేశ్వరి, జయశ్రీ, కరుణ, మాధురీ, లత, శ్రీను, చంటి, షణ్ముఖరావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ పారినాయుడు

కంచిలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.పారినాయుడు కోరారు. గురువారం కంచిలి మండలంలోని అంపురం జంక్షన్ వద్ద యువతకు సైబర్ క్రైం, మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.

గిరిజనులు ఆదుకోవాలి



వినతి పత్రాన్ని అందజేస్తున్న గిరిజనులు

కంచిలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గిరిజనలను అన్ని విధాలా ఆదుకోవాలని గిరిజన సంఘం నాయకులు నరసింగో, మహేష్ గమాంగో కోరారు. ఈ మేరకు నువాగడ పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. గురువారం వినతి పత్రాన్ని అందజేశారు.



ప్రారంభానికి నోచుకోని వమరవల్లి డైట్ వద్ద ఉన్న నూతన భవనం

ప్రారంభోత్సవానికి ఎదురుచూపు

గార, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గార మండలం వమరవల్లి డైట్ కళాశాల వద్ద అదనపు భవనాల నిర్మాణం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇక్కడ వసతి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం రూ.2.40కోట్ల నిధులతో భవనం మంజూరు చేసింది. 2020 డిసెంబర్ 19న అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అదనపు తరగతులు, పరిపాలన విభాగం నూతన భవనం నిర్మాణం పూర్తయి ఆరు నెలలు అవుతోంది. కానీ ప్రారంభించకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి ఈ భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవాలి



ఉత్తమ బృందంగా గుర్తింపు పొందిన పత్రాన్ని చూపుతున్న వీసీ తదితరులు

ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవరచుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారి వాజ్‌పాయ్ మౌంటనింగ్ అండ్ ఏలైడ్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్ (మనాలి)లో 10 రోజుల పాటు నిర్వహించిన జాతీయ సాహస శిబిరంలో బీఆర్ఏయూ ఎన్ఎస్ఎస్ విభాగం తరఫున 10 మంది వలంటీర్లు పాల్గొన్నారు. ఈ బృందం ఉత్తమయూనిట్‌గా ఎంపికకావడంతో వీరిని గురువారం వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ, పీవో కె.కరుణానిధి పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజనతో ప్రయోజనం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయడం వల్ల దేశం శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని రాగోలులో గురువారం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన షాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్య ఘర్ యోజనతో అన్నివర్గాల ప్రజలకు ఎంతగానో ప్రయోజనం ఉంటుందని తెలిపారు.



సూర్యఘర్ యోజనా షాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చెక్కు పంపిణీ

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కరజాడలో ప్రగడ నిర్మలకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ లక్ష అరవై వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెకు అందజేశారు. గురువారం కరజాడలోని నిర్మల నివాశానికి ఎమ్మెల్యే శంకర్ వెళ్లి వారి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎచ్చెర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ) సతీమణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మికి ఇటీవల కాలుకు గాయంకావడంతో స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం పరామర్శించారు. ఎస్ఎంపురంలోని బాబ్జీ ఇంటికి ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గంలోని పలువురు కూటమి నేతలు వెళ్లి ఆమె ఆరోగ్యం అడిగి తెలుసుకున్నారు.



చౌదరి ధనలక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పండుగ వాతావరణంలో పేరెంట్స్, టీచర్ల సమావేశం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గుజరాతీపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పండగ వాతావరణంలో నిర్వహించడానికి సర్వం సిద్ధమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో డీఈవో తిరుమల చైతనతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పాఠశాలల అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలకు విరాళాలు ఇచ్చిన దాతలు, పాఠశాలల అభివృద్ధికి దోహదపడే పూర్వ విద్యార్థుల, స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. డొక్కా సీతామ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు అందజేస్తున్న ఆహారాన్ని ఆ రోజు పిల్లల తల్లిదండ్రులకు అందజేయనున్నట్లు తెలిపారు.

తక్షణ ప్రతిపాదనలు పంపాలి

అరసవల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రహదారి పనులకు ప్రతిపాదనలు తక్షణమే పంపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐటీడీఏ అధికారులను ఆదేశించారు.ఐటీడీఏసంక్షేమం, అభివృద్ధి పథకాలపై అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గరువారం సమీక్షించారు. పాతపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న పనులపై ఆరాతీశారు. గ్రామాలకు రహదారులు, కనెక్టవిటీ లేని గ్రామాలు ఎన్ని ఉన్నాయని ఆయన ఆరాతీశారు. 114 ఉన్నాయని, ఇందులో ఆరు పూర్తయినట్లు ఈఈ రమాదేవి వివరించారు. మిగిలిన రహదారులకు నిధులు కొరత ఉందని తెలిపారు. గిరిజన సంక్షేమంలో విద్యకు సంబంధించి మొత్తం స్కూల్ ఎన్ని ఉన్నాయని ప్రశ్నించగా 147 ఉన్నట్లు చెప్పారు. విద్యార్థులు సంఖ్య, టీచర్ల సమస్యలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి, ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నదొర, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఈవో తిరుమల చైతన్య ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ట్రాపిక్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ట్రాపిక్‌సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసులకు సూచించారు. నగరంలో ట్రాఫిక్, టూటౌన్ పోలీసుస్టేషన్లను గురువారం తనిఖీ చేశారు. అనంతరం నగరంలో డేఅండ్ నైట్, రామలక్ష్మణజంక్షన్, ఏడురోడ్ల కూడలి, అరసవల్లి మిల్లు జంక్షన్ ప్రాంతల్లో ట్రాఫిక్‌పై ఆరా తీశారు. జనవరిలో పండుగ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకత చూపించాలని ట్రాఫిక్ సీఐ నాగరాజుకు ఎస్పీ ఆదేశించారు. ఆయన వెంట రూరల్ సీఐ పైడిపునాయుడు,ట్రాఫిక్ సీఐ నాగరాజు,ఎస్‌ఐలు హరికృష్ణ సంతోష్ ఉన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యలపై శిక్షణ

అరసవల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధి కోసం రూపొందించిన విజన్ -2047 డాక్యూమెంటరీ ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం నారాచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఇస్తున్న శిక్షణలో మండలస్థాయి అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇదే నా చివరి ఫోన్‌కాల్..

● నీవు వచ్చేసరికి నేను ఉండను.. భర్తకు ఫోన్ చేసి భార్య ఆత్మహత్య


శోభారాణి (ఫైల్)

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ రెడ్డికపేటలో నివసిస్తున్న బుడుమూరు శోభారాణి (32) గురువారం సాయంత్రం ఆత్మహత్యకుపాల్పడింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఇంట్లో కుటుంబ కలహాల వల్ల మనస్థాపానికి గురైన శోభారాత్రి భావనపాడులో ఉంటున్న తన భర్త బుడుమూరు గురుమూర్తికి గురువారం మధ్యాహ్నం ఫోన్ చేసింది. ఇదే నేను నీకు చేసిన చివరి ఫోన్‌కాల్.. నీవు వచ్చినా.. నేను ఉండను అంటూ ఫోన్‌చేసిన తరువాత కొద్ది నిమిషాలకే ఇంట్లో తలుపులు వేసుకొని ఇంట్లో ఉరిపోసుకుంది. ఈ విషయం భావనపాడులో ఉంటున్న శోభారాణి భర్త గురుమూర్తి రెడ్డికపేటలో ఇంటి సమీపంలో ఉన్న ఓ వ్యక్తికి ఫోన్ చేశాడు. తన భార్య ఫోన్‌చేసి.. ఇదే చివర ఫోన్ కాల్ అంది. ఒక్కసారి ఇంటికి వెళ్లి చూడాలని కోరాడు. తలుపులు ఎంత తీసేందుకు గ్రామస్థులు ప్రయత్నించినా రాకపోవడంతో భర్తకు సమాచారంఇచ్చారు. కిటికిలో నుంచి గ్రామస్థులు చూసేసరికి ఉరిపోసుకొని ఉన్నట్లు కనిపించింది. దీంతో భావనపాడులో ఉంటున్న భర్త స్వగ్రామ బయలుదేరాడు. చల్లపేటలో ఉంటున్న భర్త శోభారాణి తండ్రి సింహాచలానికి సమాచారం ఇవ్వడంతో ఆయనకు పోలీసులు తెలియజేశాడు. పోలీసులు తలుపులు పగులగొట్టారు. శోభారాణికి కుమారులు నిరంజన్, హరంజన్ ఉన్నారు. శోభారాణి మృతిపై సమాచారం వచ్చిందని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కొన్నాళ్లుగా రెడ్డికపేటలో అద్దె ఇంట్లో ఉంటున్న వీరు ఏడాదిన్నర కిందట సొంతిళ్లు కట్టుకున్నారు.శోభారాణి తండ్రి సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి యువకుడు..

నందిగాం,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కవిటిఅగ్రహారం సమీపంలోని రైల్వేలైన్ వద్ద అదేగ్రామానికి చెందిన పుచ్చకాయల ప్రతాప్(20) రైలు కిందపడి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పలాసజీఆర్పీ ఎస్ఐ షరీఫ్ కథనం మేరకు.. ప్రతాప్ కూలీ పనులుచేస్తు జీవిస్తున్నాడు. మనస్థాపానికిగురై గురువారం పలాస నుంచి విశాఖపట్నం వెళ్లే రైలుమార్గంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.గుర్తించిన స్థానికులు రైల్వేపోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసునమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు శవాన్ని అందజేశారు. ప్రతాప్‌కు తల్లిదండ్రులు మాధవి, నర్సింహమూర్తి ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


సింహాచలం (ఫైల్)

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరువాని చెరువులో పడి సంతోష్‌నగర్‌కు చెందిన గొండు సింహాచలం (33) బుధవారం రాత్రి మృతిచెందాడు.పోలీసుల కథనం మేరకు.. రోజు వారి కూలీ పనులకు వెళ్తున్న సింహాచలం బుధవారం సాయంత్రం పనులు ముగించుకున్న తర్వాత చెరువులో దిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి ఊబిలోకి చిక్కుపోయాడు. దీంతో రాత్రంతా గాలించినా సింహాచలం మృతదేహం లభించిలేదు. గురువారం ఉదయం క్లూస్‌టీఎం సంఘటన ప్రాంతాన్ని పరిశీలించింది. అగ్నిమాపక సిబ్బంది గాలించి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. భర్త మరణంతో భార్య సంతోషి రోదిస్తోంది. సింహాచలానికి చరిష్మా కుమార్తె, నిషాంత్ కుమారుడుతోపాటు తల్లిదండ్రులు గుండు బొడ్డు, నారాయణమ్ములు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

టెక్కలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్‌లో గుర్తుతెలియని ఓ మృతదేహాన్ని గురువారం గుర్తించినట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఈ మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రి మార్చురీలో ఉంచనున్నామని, ఎవరైనా గుర్తిస్తే వారి బంధువులకు మృతదేహాన్ని అప్పగిస్తామని చెప్పారు. మృతదేహాన్ని రెండు రోజుల పాటు చూసి ఆ తర్వాత ఖననం చేస్తామని తెలిపారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

కోటబొమ్మాళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణవలస సంత సమీపంలో గురువారం సాయంత్రం నారాయణవలస గ్రామానికి చెందిన రావాడ అప్పలమ్మ మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడు చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు.. అప్పలమ్మ నారాయణవలస వారపు సంతకు పసుకు కొనడానికి వెళ్లింది. బజారు చేసుకొని తిరిగి ఇంటికి బయలుదేరింది. నారాయణవలస ఎఫ్‌సీ గిడ్డంగుల వద్ద వెనుక నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి మెడలో పుసెలతాడును తెంచుకొని పరారయ్యారు. అప్పలమ్మ కేకలు వేసినా ఫలితం లేకుండాపోయింది. ఈమేరకు అప్పలమ్మ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

కారు అదుపు తప్పి బోల్తా

నందిగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతామరాపల్లి సమీప జాతీయరహదారిపై గురువారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి రహదారిలో బోల్తాపడింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోకవడంతో వాహన యజమానికి ప్రమాదం తప్పింది. బోల్తాపడిన కారుని హైవే సిబ్బందితో పాటు అటుగా వెళ్తున్న పలువురు వాహనదారులు కారుని పైకి లేపి పక్కకు పెట్టారు.

అక్రమ రవాణా చేస్తున్న పశువుల స్వాధీనం

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్ము వద్ద తిలారు సంత నుంచి అక్రమంగా వాహనంలో తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. తిలారు సంత నుంచి అలమండ సంతకు తరలిస్తున్న పశువుల వ్యాన్‌ను పట్టుబడింది. ఎటువంటి పత్రాలు లేకుండా పశువులు అక్రమ రవాణా చేయడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్ నేతృత్వంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న పశువులను కొత్తవలస గోశాలకు అప్పగించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నీలాపురం రోడ్డులో కొండచిలువ హతం

పలాస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల నీలాపురం రోడ్డులో గురువారం సాయంత్రం భారీ కొండచిలువను స్థానికులు హతమార్చారు. 12 అడుగులకుపైగా ఉన్న ఈ కొండచిలువ రోడ్డుపైకి రావడంతో ప్రజల భయాందోళనకు గురయ్యారు. దీంతో స్థానికులు హతమార్చారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న గోవిందరావు

మందస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి సభ్యులు కె.మోహనరావు కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ హక్కులపై అన్యాయం చేస్తోందని విమర్శించారు. గురువారం మందస సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకొని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఆర్.ప్రకాశరావు, ఆర్.దిలీప్‌కుమార్, మట్ట ధర్మారావు తెలిపారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో పంచాయతీ అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై పంచాయతీ అధికారులు తాత్సర్యం వహిస్తున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని జగన్నాథపురానికి చెందిన పోగోటి వెంకట్రావు ఈవోకు గురువారం వినతిపత్రం అందజేశారు. పట్టణ, సత్యవరం పరిధిలో పలు ప్రాంతాల్లో సుడా, పంచాయతీ అనుమతిలేకుండా నిర్మాణాలు సాగుతున్నట్లు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో కలెక్టర్, డీపీవోకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నిర్వహణ లేక.. నిరుపయోగం

● రోడ్లకు ఇరువైపులా పేరుకుపోతున్న చెత్త ● ఇదీ జలుమూరు మండలంలో చెత్త సంపద కేంద్రాల పరిస్థితి


జోనంకి వద్ద నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రం

జలుమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సంపద కేంద్రాలు ఏర్పాటుచేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్త నుంచి సంపద కేంద్రాలను విస్మరించడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

మండలంలోని 40 పంచాయతీలకుగాను 33 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మించారు. మిగతా ఏడు పంచాయతీల్లోను స్థలాలు లేక ఏర్పాటుకాలేదు. ప్రతి పంచాయతీలోను గ్రామాల నుంచి చెత్తను సేకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించి తడిచెత్త, పొడిచెత్త విడదీసి ఎరువులు, వానపాములు పెంపకం తదితర ఎరువులు తయారుచేసి రైతులకు విక్రయించి ఆదాయం ఆర్జనకు గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్తసంపద కేంద్రాలపై దృష్టి సారించకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. చెత్తసేకరణకు పంచాయతీల నుంచి ప్రతినెలా వేలాది రూపాయలు వ్యయంచేస్తున్నారు.సేకరించిన చెత్తను చెత్తసంపద కేంద్రాలకు తరలించకపోవడంతో రోడ్ల పక్కన పేరుకుపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్తనుంచి సంపద కేంద్రాల నుంచి సంపదను సృష్టించి పంచాయతీలకు ఆర్థికంగా బలోపేతంచేస్తారనిప్రజలు ఎదురుచూస్తున్నారు. కాగా మండలంలో 33పంచాయతీల్లో చెత్తనుంచి సంపదకేంద్రాలు నిర్మించినట్లు ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు.వీటిని వినియోగంలోకి తెచ్చి ఆయాపంచాయతీలకు ఆదాయ వనరులు వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

రోడ్లపై కుప్పలు.. రాకపోకలకు తిప్పలు

● ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదాలు


హరిశ్చంద్రపురం వద్ద రోడ్డుకు అడ్డంగా వరిచేను కుప్పలు పెట్టిన దృశ్యం

కోటబొమ్మాళి,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిశ్చంద్రపురం తదితర గ్రామీణ ప్రాంతాల్లో గల బీటీ, సీసీ రోడ్లపై ధాన్యం కుప్పలుపెడుతుండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించేక్రమంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.వరిచేను కుప్పలు పెట్టడంతోపాటు, ధాన్యం రోడ్లపై ఆరబెట్టడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రధానంగా చీకటిపడిన తర్వాత వచ్చిపోయే ద్విచక్రవాహనచోదకులు ధాన్యం కుప్పలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.దీనికితోడు వరి కంకులను యంత్రాలతో రోడ్డుపైనే నూర్పిడి చేయడంతో దుమ్ముధూళి కళ్లలో పడుతోందని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. తక్షణమే రోడ్లు భవనాలు, పోలీసు, పంచాయతీ రాజ్ అధికారులు ధాన్యం కుప్పలు అడ్డంగా ఏర్పాటుచేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనచోదకులతోపాటు బీజేపీ మండలాధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు హనుమంతు అప్పలరాజు కోరుతున్నారు.

పలాసలో రైల్వేకార్మిక సంఘ ఎన్నికలు

పలాస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్‌లో యూనియన్ల గుర్తింపు కోసం కార్మిక సంఘ ఎన్నికలు పోలింగ్ నిర్వహిస్తున్నారు.రన్నింగ్ స్టాఫ్ సిబ్బంది కోసం నిర్వహించిన ఎన్నికల్లో గురువారం రెండోరోజు ప్రశాంతంగా పలువురు ఓటు వేశారు. పలాస బ్రాంచ్‌కు సంబంధించి పలాస, మందస, సోంపేట, జాడుపూడి రైల్వేస్టేషన్ల పరిధిలో671 మంది కార్మికులు ఉన్నారు.వీరంతా ఓటుహక్కు వినియోగించుకోవడానికి మూడురోజుల పాటు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.శుక్రవారం కూడా ఎన్నికలకు సంబంధించి మరికొందరు ఓటు వినియోగించుకోనున్నారు. స్థానిక బ్రాంచ్‌లో శ్రామిక్‌కాంగ్రెస్, శ్రామిక్‌యూనియన్, ఎంప్లాయీస్ యూనియన్లు తలపడుతుండగా మొదటి రెండు యూనియన్ల మధ్య పోటీ తీవ్రంగాఉంది. విశాఖపట్నం, సంబల్‌పూర్, ఖుర్దారోడ్ డివిజన్‌కు సంబంధించి జోన్లవారీగా ఈఎన్నికలు నిర్వహిస్తున్నారు. శ్రామిక్‌కాంగ్రెస్ నుంచి రమేష్‌చంద్రసాహు, శ్రామిక్ యూనియన్ నుంచి పికెపట్నాయ్ బరిలో ఉన్నారు.

బాలికల చదువుకు సహకరించాలి: ఎంపీడీవో

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే బాలికలకు పెళ్లిళ్ల చేయకుండా వారికి ఉన్నత చదువులు అందించాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు తెలిపారు. గురువారం వజ్రపుకొత్తూరు ఉన్నతపాఠశాల విద్యార్థులతో జెండర్ క్యాంపేయిన్‌లో భాగంగా ఏర్పాటుచేసిన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు

టెక్కలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై గల సంతోషిమాత ఆలయ హుండీని గురువారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. లెక్కింపుకు కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయ ఈవో పర్యవేక్షణలో ఈవో మనస్విని పాల్గొన్నారు. రూ.23,317 హుండీ లెక్కింపు ద్వారా ఆదాయం సమకూరిందని తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

టెక్కలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఐటీ రూర్కెలా సౌజన్యంతో రెండురోజుల పాటు ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ అండ్ ఇంటిలిజెంట్ మ్యానిఫేక్చరింగ్ సిస్టమ్స్ అన్న అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సదస్సు కన్వీనర్ సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ వై.రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా 156 మంచి ఆలోచనలు వచ్చాయని, వాటిలో అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన 50 పేపర్లను గుర్తించామని తెలిపారు. సదస్సులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత,డీన్లు బీవీ రమణ, సీహెచ్.రమేష్, డి.శ్రీరాములు, యూడీ ప్రసన్న, కోఆర్డినేటర్ ఎం.జయంతిరావు పాల్గొన్నారు.

కాణిపాకం వినాయకుడికి పూజలు

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తన కుటుంబ సభ్యులతో గురువారం కాణిపాకం వినాయకుడుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆయన జన్మదినం పురస్కరించుకుని కుటుంబసభ్యులతో సహా తీర్థయాత్రలకు వెళ్లారు. ఆయన వెంట ఎమ్మెల్యే రమణమూర్తి సతీమణి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బగ్గు సుగుణ, కుటుంబ సభ్యులు ఉన్నారు.

సేంద్రీయ ఎరువులతో భూసారం పెంపు: ఏడీఏ


పాతపట్నం:మృత్తిక సంరక్షణపై విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు

జలుమూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ ఎరువులను వాడకం ద్వారా భూసారం పెరుగుతుందని ఏడీఏ రవీంద్రభారతి తెలిపారు. గురువారం టెక్కలిపాడులో ప్రపంచనేల ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని రైతులకు భూసార కార్డులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూరబీలో సాగు చేసి పంటలకు ఈనెల 31 వరకు బీమాసదుపాయం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సురేష్ పాల్గొన్నారు.

●పాతపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేలలు ప్రజారోగ్య సూచికలని హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు తెలిపారు. గురువారం పాతపట్నం ప్రభుత్వోన్నతపాఠశాల, కొమ్మలగూడలో కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వోన్నతపాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎన్‌టీ రామారావు నేలల ఆవశ్యకతను వివరించారు. కొత్తూరు వెలుగు ఏరియా కోఆర్డినేటర్, సీసీ జగన్, నాగన్న మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.

గంజాయి అక్రమరవాణాపై ఉక్కుపాదం: సీఐ


పలాస: వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ మోహనరావు, సిబ్బంది

పలాస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు తెలిపారు. గురువారం పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో వాహనాలను ప్రత్యేక పోలీసుల సహాయంతో వాహనాల నెంబరు ప్లేట్లు, ఆర్‌సీ, సీ బుక్‌లను తనిఖీచేశారు. అనంతరం అనుమానిత వాహనాల డిక్కీలను ఓపెన్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఒడిశాతో అనుసంధానంగా రహదారులు ఉండడంతో గంజాయి అక్రమ రవాణాకు ఆస్కారం ఏర్పడుతుందని, దీనిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

టెక్కలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరాగాంధీ కూడలిలో గురువారం సాయంత్రం టెక్కలి టౌన్ సీఐ ఎ.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనాలపై అపరాధ రుసుం విధిస్తామని పోలీసులు తెలిపారు.

అవగాహన లేక.. వినియోగానికి నోచుకోక

●రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించని వైనం
●బందరువానిపేటలో నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు


బందరువానిపేటలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

గార, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని బందరువానిపేటలో మత్స్యకారుల కోసం గతంలో టీడీపీ హయాంలో లక్షలాది రూపాయలు వ్యయంతో నిర్మించిన 30 సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రధానంగా శతశాతం ఆరుబయట బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలన్న లక్ష్యం అటకెక్కుతోంది. వినియోగంపై అవగాహన లేకపోవడంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్ల పరిసరాల్లో తుప్పలు, డొంకలు పెరగడంతో విషజంతువులు సంచరిస్తున్నారు. అప్పట్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదరాబాదరాగా లక్ష్యాలు కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించినా రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సైతం వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలుతీసుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

ఇంటిపన్ను వసూళ్లపై దృష్టిపెట్టాలి: డీఎల్‌పీవో

నందిగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇంటిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలని డివిజినల్ పంచాయతీ అధికారి గోపి బాల సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీకార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల వారీగా ఇంటిపన్నుల బకాయిలపై ఆరాతీస్తూ సకాలంలో పన్ను వసూళ్లు చేపట్టి లక్ష్యాలు సాధించాలన్నారు. స్వర్ణ పంచాయతీ డేటాఎంట్రీ, పీఆర్-1 యాప్‌లపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు ఎంపీడీవో టి.రాజారావు అన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనాలు


నిరుపయోగంగా మారిన సవరరామకృష్ణాపురం పాత పాఠశాల భవనం

పలాస రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదంచల పంచాయతీ పరిధిలోగల సవరరామకృష్ణాపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో గతంలోని పాఠశాలల భవనాలు నిరుపయోగంగా మారాయి. సవరరామకృష్ణాపురంలో గతంలో ఈ భవనంలో పాఠశాలను జీటీడబ్ల్యు ఆధ్వర్యంలో నిర్వహించేవారు. తర్వాత కాలంలో కొంతమంది విద్యార్థులు మెళియాపుట్టి, మరికొంతమంది పెదంచల తదితర గ్రామాల్లో పాఠశాలలో చేరడంతో ఇక్కడ పాఠశాల భవనం వృథాగా మారింది. కేవలం ఎన్నికల సమయంలోనే వినియోగిస్తున్నారు. ఎన్నికలు జరిగి సుమారు ఆరు నెలలు దాటడంతో వినియెగంలో లేకపోవడంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడమే కాకుండా విషసర్పాలకు నిలయంగా మారింది. అలాగే జాతీయరహదారికి ఆనుకొని ఉన్న రామకృష్ణాపురంలో గల గతంలో నిర్వహించే పాఠశాల భవనం కూడా నిరుపయోగంగా మారింది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

రెక్కరాల్చు పురుగుతో రైతుల్లో ఆందోళన


దేవాడలో నేలపాలైన వరిచేను ఎన్నులు

నందిగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెక్కరాల్చు పురుగుతో పంట నేలపాలు అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వల్లభరాయుడుపాడుతో పాటు దేవాడ, భరణిగాం, మణిగాం, సైలాడ, డీఆర్‌సీపురం తదితర గ్రామాల్లో ఎన్ను నేలపాలు అవుతుండడంతో ఆరుగాలం పండించిన పంట దక్కించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. దీంతో పంట 20శాతం మేర నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఎస్.కూర్మినాయకులు, జి.మన్మథరావు, ఎస్.కృష్ణారావు, బి.రాము, ఎ.సుదర్శనరావు, ఎం.గురునాథ్, జి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పేర్కొన్నారు. పంట నష్టంపై అధికారులు, పాలకులు చొరవ చూపి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


జలగలింగుపురం వద్ద కల్లంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

హమ్మయ్య.. ఆరబెట్టుకుంటాం

● ధాన్యం ఎండబెట్టే పనుల్లో రైతులు నిమగ్నం

మెళియాపుట్టి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జలగలింగుపురం తదితరగ్రామాల్లో రైతులు ధాన్యాన్ని ఆరబట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. తుపాన్ ప్రభావంతో ఇటీవల నాలుగురోజులుగా వర్షాలు కురవడంతో రైతులు వరికంకులను కుప్పలు పెట్టిన విషయం విదితమే. మరికొందరు ఆదరాబాదరాగా ధాన్యంరాశులుగా పోసి రక్షించుకున్నారు. గురువారం ఎండపెట్టడంతో పలు గ్రామాల్లో రైతులు ధాన్యం తడిచిపోవడంతో మొలకులు రావడంతో ఎండబెట్టారు. మరికొన్ని గ్రామాల్లో బస్తాల్లో నిల్వచేసిన ధాన్యం కూడా ఆరబెడుతున్నారు.కొందరు రైతులు ఎండిన ధాన్యం విక్రయించేందుకు సిద్ధంచేశారు.

నేడు సుస్థిరాభివృద్ధి లక్ష్యంపై శిక్షణ

పలాస రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాస మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యం అన్న అంశంపై మాస్టర్ ఆఫ్ ట్రైనింగ్(ఎంవోటీ) శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.వసంత్‌కుమార్ తెలిపారు.ఈమేరకుఆరుమండలాల నుంచిఎంపీహెచ్‌వో, ఐసీడీఎస్ సూపర్‌వైజరు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు, ఈవోపీఆర్డీకుశిక్షణఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనాపురం, కొత్తగ్రహారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒకప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేయనుండడంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మదనాపురం, దిమ్మిడిజోల,దీనబంధుపురం, అన్నాపురం, కల్లాడ, హర్షబాడతో పాటు దేవుపురం, కొత్తగ్రహారం ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

రొయ్యల చెరువులకు ...

సంతబొమ్మాళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం తంపర లోసాగువుతున్న రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు విద్యుత్ ఏఈ ఎం.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలిఆర్డీవో ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల్లో సాగవుతున్న రొయ్యల చెరువులకు చెందిన 13 విద్యుత్ కనెక్షన్లు నిలిపివేశామని పేర్కొన్నారు.వేలాది రుపాయల డిపాజిట్ కట్టి విద్యుత్ కనెక్షన్లు పెట్టించుకున్నామని, అర్థాంతరంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల తీవ్రంగా నష్టపోతామని రొయ్యల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పలాస రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం, మునిసిపాలిటీ పరిధిలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి జనవరి ఎనిమిదో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎన్.కల్యాణచక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, భూలబ్ధిదారులకు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

●సంతబొమ్మాళి,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం రెవెన్యూ సదస్సులపై వీఆర్వోలతో సమీక్షించారు.

8న మాలల గర్జన

నందిగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జనను విజయవంతం చేయాలని మండల దళిత సంఘ ప్రతినిధి అంబోడి సురేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖ గురజాడ కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమానికి హర్షకుమార్, మల్లెల వెంకట్రావు తదితరులు హాజరవుతున్నారని తెలిపారు.

విద్యార్థులకు టాలెంట్ పరీక్ష

జలుమూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం జడ్పీ ఉన్నతపాఠశాలలో గీతాజయంతి పురస్కరించుకొని గురువారం విద్యార్థులకు టాలెంట్ పరీక్షలు నిర్వహించారు.కరవంజ మోడల్‌స్కూల్ విద్యార్థులు రావాడ హేమశిరీష, రావాడ చాందని, బుడితి జెడ్పీ స్కూల్ విద్యార్థి పి.భువనలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీన కేతన్,గీతాసత్సంగ సభ్యులు రవిశంకర్, శ్రీనివాసరావు, దేవా, గోవిందరావు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన

సంతబొమ్మాళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేట ఎంపీయూపీ పాఠశాలల్లో విద్యార్థులకు నేరాల నియంత్రణపై నౌపడ ఎస్ఐ నారాయణస్వామి అవగహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీటీఎం విజయవంతంచేయాలి

నందిగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించనున్న పేరెంట్స్ టీచర్ మీట్(పీటీఎం)పై సర్వశిక్ష అభియాన్ అధికారులు ఆరాతీశారు. ఈ మేరకు గురువారం నందిగాం ఉన్నత పాఠశాల, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి కార్యక్రమ నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై ఎంపీడీవో టి.రాజారావు, ఎంఈవో టి.నర్సింహులు, హెచ్‌ఎం వై.హరిబాబుతో సీఎంవో పి.ప్రభాకరరావు, ఐఈడీ జిల్లా కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, ఎంఐఎస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ శోభారాణిలు చర్చించారు. ఈ కార్యక్రమంవిజయవంతానికి కృషి చేయాలని సూచించారు.